## కథ

# స్మృతి పరిమళం

ఆంగ్లమూలం: గ్రహం గ్రీన్

అనుసృజన: ఓలేటి శ్రీనివాసరావు భాను



పొరపాటు చేసేను. ఈ ఊరికి ఒక్కడినే వస్తే బాగుండేది. అనవసరంగా లోలాకి శ్రమకలిగించేను. బండి దిగినప్పటి నుండి ఆవిడ ఒకటే సణుగుడు. సెలవల్ని సరదాగా గడపడానికి ఏ సముద్రపు ఒడ్డుకో తీసుకెళ్ళకుండా ఈ మారు మూల ప్రాంతానికి తీసుకు రావడం నిజంగా తప్పే. పురాతనమైన స్టేషన్ పరిసరాలూ, రాలిన ఆకుల గుట్టలూ లోలాకి కనువిందుగా కానరాక పోవడంలో ఆశ్చర్యం లేదు. ఆకులు రాలే కాలం. నా మనో వాతావరణానికి అనువైన కాలం. అది నా బాల్యాన్నీ, రాలిపోయిన జ్ఞాపకాల్నీ గుర్తుచేస్తుంది. గతించిన నా బాల్యం గడిచింది ఈ ఊళ్ళోనే. నా అనుభూతుల్ని తడితడిగా దాచకుంది ఈ మట్టి పొరల్లోనే. అందుకే ఈ ఊరంటే నాకభిమానం.

పిల్లకాలువా, వంతెనా, ధాన్యం గిడ్డంగులూ, గోడమీద పాత సినిమా వాల్‌పోస్టరూ, గుట్టమీద దీపాల తోరణం, ఆప్తమిత్రుల్లా పలకరించేయి. చూపుల్తో కరచాలనం చేసేను. పిల్లకాలువని ఆనుకున్న ఇసుక తిన్నెలు నాకు సముద్రపు తీరంలా కనిపించేయి.

"ఇసుక దిబ్బలూ, పూరిగుడిసెలూ, కంకర్రాళ్ళ తోవా... ఈ జాగా ఇంత అధ్వాన్నంగా వుంటుందనుకో లేదు" అంది లోలా. నేను మాత్రం సూట్‌కేసు మోస్తూ, మౌనంగా నడుస్తున్నాను. కాలిబూట్ల కింద కంకర చేస్తున్న చప్పుడు కమ్మటి స్వరధునిలా వుంది. ఈ ప్రదేశం గురించి లోలాకి ఎంతగానో వివరించవలసి వుంది. ఈ నేల గురించి, ఇక్కడి గాలిలో గిరికీలు కొట్టే పాటల గురించి ఒక్క ముక్కైనా చెప్పకుండా, ఆమె నా అనుభూతుల్ని అర్థం చేసుకోవాలని ఆశించడం నా పొరపాటని ఒప్పుకుంటాను.

స్కూలు భవనాన్నీ, చర్చినీ దాటి పెద్ద వీధిలోకి అడుగు పెట్టేం. నా మనసు పన్నెండేళ్ళ పసితనపు ముంగురుల్ని సవరిస్తోంది. జ్ఞాపకాలు చాలా గొప్పవి. నాకిప్పుడే బాధ పడుతోంది. ఇన్నాళ్ళకి ఈ గడ్డమీద మళ్ళీ కాలూనక పోతే, వాటి విలువ నాకు అవగతం అయి వుండేది కాదు. అలాగని, నా బాల్యం ఘనంగా గడిచిందనీ చెప్పలేను. బంగారు తేరు మీద ఊరేగక పోయినా, భయం మరిచి బతికిన దినాలవి. అయితే వాటిని నేనెందుకు ప్రేమిస్తున్నానని ప్రశ్నించుకుంటే, చలిమంటల పొగవాసన, శీతకాలపు సాయంత్రాల పొగమంచు, నాసికాపుటాల్ని గిలిగింత పెట్టి, నన్ను ఉక్కిరి బిక్కిరి చేసినప్పుడు అవ్యక్తంగా సమాధానం స్ఫురిస్తుంది. అది వాసన. అమాయకత్వపు సువాసన. పాలుగారే పసితనపు ఒంటిని ఒరసి గాలి మోసుకొచ్చే చందన పరిమళం. దాని కోసం బాల్యాన్నీ, శైశవాన్నీ గడిపిన పరిసరాల్ని ప్రేమిస్తున్నాను.

'అదిగో ఆ కనిపిస్తోన్న సత్రంలోనే మనం రాత్రికి బస చేసేది" అన్నాను. లోలా అసహనంగా చూసింది. పాతకాలం నాటి ఆ సత్రంలో, ఆమె కోరుకునే సౌకర్యాలు వుండవు. వేరే మార్గాంతరం లేదు. చీకటి పడుతోంది. చలి రెచ్చిపోక మునుపే ఓ గూటికి చేరుకోవాలి. నాకు ఆత్రంగా వుంది. ఒంటరిగా గడపాలని వుంది. లోలాని సత్రంలో ఒక గదిలో వుంచి, ఒక్కణ్ణే రాత్రంతా వీధులన్నీ తిరగాలని వుంది. ఒక్కణ్ణే, పది మంది పిల్లల పెట్టై చిన్ననాటి ఆటల్ని పొగమంచు తెరల మధ్య ఆడుకోవాలని వుంది. పసితనపు అడుగు జాడల్ని ఇసుక రేణువుల్లో వెతికి పట్టుకోవాలని వుంది.

సత్రంలో గది తీసుకున్నాం. ఇంకా వంట కాలేదు. భోజనాలు వడ్డించడానికి సమయం పడుతుందన్నారు. అంత వరకు లోలాని గదిలో విశ్రమించమని చెప్పి, ఆవిడ అనుమతితో వీధిన పడ్డాను. పాతకాలం నాటి వీధి దీపాలు వెలుగుతున్నాయి. అయితే మంచు పొరల్లో వాటి వెలుతురు ఇంకి పోతోంది. వీధిలో ఆ కొస నుండి, ఈ కొసకి దేనికోసమో వెతికినట్లు వెంపర్లాడేను. ఒకనాడు నాలుక కొసలనంటి, వర్ణించిన మధుర గీతపు పల్లవిని, గురుతుకు తెచ్చుకోలేని వాడిలా, అలనాడు కట్టెదుటి వర్ణచిత్రపు రేఖల్ని, ఛాయా మాత్రంగా నైనా స్ఫురణకు తెచ్చుకోలేని నిస్సహాయ మానసికావస్థలా, దీపస్తంభం కింద నిలబడి పోయేను.

అంతలో ఏదో కోలాహలం. ఎదురుగా వున్న గుట్టమీంచి పిల్లలు బిల బిల మంటు దిగుతున్నారు. పూల మేఘాల్లాంటి గుంపును చూడగానే, ఎన్నో గుర్తుకొచ్చేయి. మరుగున దాగిన పల్లవులు తుమ్మెదల్లా ముసురుకున్నాయి. వెలిసి పోయిన వర్ణచిత్రం నిలువెత్తున నిలబడింది. పసివాళ్ళ కేరింతలు గాలిలో కోసుకు పోతున్నాయి. వాళ్ళ భుజాలకు సంచులు వేలాడుతున్నాయి. వాటి మీద పేర్లు, ఎంబ్రాయిడరీ దారపు పోగుల్లో కనిపిస్తున్నాయి. ఒకే రంగు దుస్తుల్లో, రెపరెపలాడుతున్న పావురాల్లా పిల్లలు దిగివస్తున్నారు. అరచేతి మందాన రిబ్బన్ ముళ్ళు, అమ్మాయిల శిరసుల మీద సీతాకోక చిలుకల్లా వున్నాయి. నిగ నిగమెరిసే కాలిబూట్లను, నిశ్శబ్దాన్ని నిద్రపుచ్చే లయబద్ధమైన వాటి నడకను గమనించినప్పుడు పియానో మెట్ల మీద సుతి మెత్తని వేలి కొసలు శ్రావ్యమైన స్పర్శని ముద్రించినట్లు అనిపిస్తోంది. అంటే, గుట్టమీద డాన్స్ క్లాసులు జరుగుతున్నాయన్న మాట. అటు వేపు నడక సాగించేను. కిల కిలమంటూ చిన్నారులు నన్ను దాటుకుని వెళ్ళిపోయేరు. మెలికలు తిరిగిన బాట మీద నడుస్తున్నాను. గుట్టమీద కొత్తగా ఇల్లు లేచేయి. మునుపు ఆ జాగా ఖాళీగా వుండేది. కొత్త ఇళ్ళని దాటి వెళ్తే అదుగో కనిపించేదే డాన్స్ టీచర్ ఇల్లు. అప్పట్లో ఆమె వయసు మూడు పదులు వుంటాయేమో. బహుశ ఇప్పటికీ ఆవిడే పాఠాలు చెబుతున్నారనుకుంటాను. సమయం ఏడు గంటలు దాటింది. అంటే సీనియర్లకి డాన్స్ క్లాస్ జరుగుతోందన్న మాట. అలనాటి పాటల పాఠం, పియానో మెట్లని ఒరుసుకుంటూ కిటికీ లోంచి బయటపడి, నన్ను గుర్తు పట్టిందేమో, వడివీధిన నా ఒంటిని చుట్టుకు పోయింది. నన్ను పెనవేసుకుని, చెవిలో జ్ఞాపకాన్ని ఊది, తియ్యటి అనుభవానికి ప్రాణం పోసి, రూపం కల్పించింది... అవును... ఆమె... ఆ అమ్మాయి... ఫోటో అవసరం లేకుండానే గుర్తు తెచ్చుకోగలను. ఆమె నాతోపాటు డాన్స్ క్లాస్‌కి వచ్చేది. నాకన్నా ఒక సంవత్సరం పెద్ద. అప్పుడామెకి ఎనిమిదేళ్ళుంటాయేమో. ఇప్పుడు వినిపిస్తున్న పియానో పాటకే, ఆనాడు కలిసి అడుగులు వేసేం. ఆమె జట్టుకోసం నా ఆత్రుత అంతా ఇంతా కాదు. అది ప్రేమో, అటు వంటి అవ్యక్త మధుర భావనో తెలీదు గాని, యవ్వనంలో కూడా నేనంతలా ఆరాటపడలేదు. అందుకే పసివాళ్ళ ప్రేమని అర్థం చేసుకుంటానే తప్ప, ఎన్నడూ ఎగతాళీ చెయ్యను.

ఆమె కళ్ళు చక్రాల్లా వుండేవి. చేప పిల్లల్లా మెరిసేవి. అద్భుత గాథల్నీ, సాహస కృత్యాల్నీ విన్నప్పుడు పసివాళ్ళ కళ్ళు ఎలా పెద్దగా విచ్చుకుంటాయో, అలా విచ్చుకుని గుండ్రంగా తిరిగేవి ఆమె కనుపాపలు. ఆమెను లిప్తమాత్రమైనా స్పృశించాలని తపించే నన్ను ఎప్పుడూ దూరంగానే వుంచేది. అందరం కలిసి ఆటలాడే వేళ, వెంబడించిన నాకు ఒక్కసారి కూడా ఆమె చిక్కలేదు. తూనీగలా పారిపోయేది. ఆట సాకుతోనైనా తాకవచ్చని ఆరాట పడిన నాకు నిరాశే మిగిలేది. మా డాన్స్ టీచర్ ఒక రోజు పుణ్యం కట్టుకుంది. మా ఇద్దరినీ ఒక జట్టుగా చేర్చి, పాటకి అడుగులు వెయ్యమంది. ఆమె చేతిలో చెయ్యివేసి, లయబద్ధంగా అడుగులు కలిపేను. ఆమె ఒంటి వాసన తలుచుకుంటే, ఈ క్షణంలో కూడా అనుభవంలోకి వస్తుంది.

ఆ మర్నాడు, మా క్లాసుకి ఆమె రాలేదు. నేను ఓ మూల ఒదిగి పోయేను. దిగులుతో తీసుకు పోయిన నాకు పియానోలో అపస్వరాలు వినిపించేయి. క్లాసు ముగిసిన వేళ, ఆమె వచ్చింది. వెతుక్కుంటూ వచ్చి పిడుగులాంటి మాట చెప్పింది.

"నిన్నటితో జూనియర్ పాఠాలు ముగిసేయి. ఈ రోజు నుంచి సీనియర్ క్లాస్‌కి వెళ్తున్నాను" అని చెప్పి, వెళ్ళిపోయింది. అంటే మా జూనియర్ క్లాస్ ముగిసిన తరువాతే రోజూ ఆమె ఇక్కడికి వస్తుందన్న మాట. కలిసి డాన్స్ చేసే భాగ్యం ఎటూ లేదు. కనీసం క్లాస్‌కి కలిసి వచ్చి, పోయే అవకాశం కూడా మూసుకు పోయింది. బాధ పడ్డాను.

ఆ తరువాత ఆమెకి నేనంటే ఇష్టమని గ్రహించేను. ఆమె పుట్టిన రోజునాడు వాళ్ళ ఇంటికి పిలిచింది. నా పుట్టిన రోజునాడు మా ఇంటికి వచ్చింది. అంతే, నాలుగు రోజులు గడిచేక, వయసుని గ్రహించిందేమో, అమ్మాయిల గుంపులోనే ఎక్కువగా మసలేది. మరోదారి లేక, అల్లరి పిల్లల ఆకతాయి మందలో చిందులు వేసే వాడిని.

చలి పెరిగింది. మంచు విపరీతంగా కురుస్తోంది. సీనియర్ క్లాస్ పియానో పాఠం కమ్మగా వినిపిస్తోంది. కాంపౌండు వాల్‌ని చుట్టి గేటు దగ్గరకు వచ్చేను. చెయ్యి వెయ్యగానే గేటు మీద బీటలు గరుగ్గా తగిలేయి. ఆ చెక్క గేటు, నాకేదో స్ఫురణకు తీసుకు వచ్చింది. చిన్న నాటి నుండీ, మనసు మూలిగినప్పుడల్లా అక్షరాల్ని ఆశ్రయించే వాడిని. బాధ, కసి, ప్రేమ, ఆవేదన వ్యక్తం చెయ్యడానికి అక్షరాలే నా సాధనాలు. అమ్మాయిల గురించి నా ఉద్దేశాల్ని, చిన్న చిన్న కాగితాల మీద రాసి, ఆ సందేశాల్ని సన్నగా మడిచి, కాంపౌండ్ గోడకి వున్న గేటు బీటల్లో భద్రపరిచేవాడిని. అలా దాస్తున్న సంగతిని, ఒకటి రెండు సార్లు ఆ అమ్మాయికి చెప్పేను కూడా! ఏమో, కాలం కలిసొస్తే నా సందేశాల్ని ఆమె చదువుతుందని ఆశ! అసలా సందేశాలేమిటో, వాటిని నేనెలా వ్యక్తం చేసేనో సరిగా గుర్తుకు రావటం లేదు. మనసుని అక్షరాల్లో అనువదించడం, ఆ వయసుకు సాధ్యం కాదని ఇప్పుడు నాకు తెలుసు. అయితే ఊహలు మనసుని మెలిపెట్టినప్పుడు, నేనెంతలా బాధని దిగమింగానో నాకు గుర్తుంది. బీటల్లోని కాగితాలు ఆమె చదివి వుంటుందన్న ఆశతో, ప్రతిరోజూ గేటుని పరీక్షగా చూసేవాడిని. అయితే, కాగితపు చుట్టలు మాత్రం కళ్ళు తెరవని పసికందుల్లా బీటల్లో ఒదిగి పోయి వుండేవి. నాకు లంఖణం చేసినంత నీరసంగా వుండేది.

గేటు దాటి వెళ్ళబోయేను. ఎందుకో బీటలు వెతకాలనిపించింది. మెల్లగా తడిమేను. మంచులో తడుస్తున్న చెక్క గేటు ముద్దముద్దగా తగిలింది. తడిసిన కర్రవాసన కమ్మగా అనిపించింది. అక్కడక్కడా కర్ర పెచ్చులు రేగి, నా గోళ్ళకి గుచ్చుకున్నాయి. ఒక చోట పెద్ద పగులు నా వేలికి తగిలింది. కుడిచేతి చూపుడు వేలు జొనిపేను. మెత్తగా ఏదో సోకింది. ఉండలా చుట్టుకు పోయిన ఆ వస్తువుని, గోరుతో నొక్కిపట్టి ఒడుపుగా బయటికి లాగేను. అది కిందపడబోయింది. గబుక్కున ఎడమ చేతిని చాచి, అరచేతితో అందుకున్నాను. కాగితం ముడతల్ని విప్పి, పెంపుడు పావురంలా దాన్ని నిమిరేను. అగ్గిపుల్ల వెలిగించి, ఎర్రటి వెలుగులో కాగితాన్ని పరీక్షగా చూసేను. సందేహం లేదు. ఆ రాత, గీతలు పొడి అక్షరాల్లో సంతకం, మూడూ నావే! చిట్టి పొట్టి గీతల్లో అబ్బాయి, అమ్మాయి... గుర్తించేను. అవి మరుగు దొడ్లో గోడల మీద చిత్రాల్లాంటివే, అయితే నాకు అసభ్యత, అశ్లీలత గుర్తుకు రాలేదు. చలి మంటల పొగవాసన, పిల్ల కాలువ, ఇసుక తిన్నెలు, ఎండు టాకుల గల గలలు, పొగమంచు గిలిగింతలు వీటన్నిటికీ అతీతమైనదేదో, ఇదీ అని నిర్వచించలేనిది, నాకు అనుభవంలోకి వచ్చింది. దానిని స్వచ్ఛమైన అమాయకత్వపు అనుభూతిగానే అర్థం చేసుకుంటాను. అణగదొక్కిన ఒంటరి భావనకి, పసితనపు వేదనా వేదంగా, సజలనయనాలకి అద్దుకుంటాను.

ఆ రాత్రి సత్రంలో, భోజనం చేసి, నడుం వాల్చిన తరువాత లోలా ముఖంలోకి చూసేను. ప్రయాణ బడలిక వలన త్వరగా నిద్రపోయింది. ఆమె ముఖం స్వచ్ఛంగా, నిర్మలంగా అమాయకంగా కనిపించింది. ఆమెను అందుకే నేను ఇష్టపడతాను. ఆ కారణం చేతనే చిన్ననాటి చిలిపి గీతల్నీ, వాటి వెనుక ఆర్తినీ అనుభూతినీ హత్తుకుంటూ వుంటాను.

జీవితంలో మూడు పదుల్ని దాటి, అన్నిరకాల అనుభవాల్నీ చవిచూసిన తరువాత, ఆ బొమ్మల్లో బూతు వుందని అనిపించడం ఆశ్చర్యం లేదు గానీ, అవి అలనాటి అనుభూతులు. ప్రతి మనసూ పాడుకోవలసిన శైశవ గీతాలు... ప్రతి మనిషీ పదిల పరుచుకోవలసిన స్మృతి పరిమళాలు..

## మిస్టర్ 'టి'


ఇతని పేరు మిస్టర్ టి. ప్రఖ్యాత బాక్సర్లు మహమ్మద్ ఆలీకి, మిక్ జాగర్‌కి బాడీ గార్డుగా పనిచేశాడు. ఈ మధ్య వచ్చిన రాకీ త్రీ సినిమాలో కూడా నటించాడు. ఈ గెటప్ ఆ సినిమాలో వేషం అనుకుంటే పొరపడినట్లే. అతనెప్పుడూ ఇదేవేషధారణలో కనిపిస్తాడు.

మెడలో ఏడురకాల బంగారు గొలుసులు, మణికట్టుకి ఆరుమూళ్ల బంగారు చైను, వేళ్ళకి నిండుగా ఉంగరాలు, చెవులకి ఏడు రింగులు నెత్తిమీద జుత్తు, ప్రక్కల నున్నటి గుండు, ఒత్తుగా పెరిగిన గడ్డం అతని ప్రత్యేకత. పేరు కూడా విచిత్రంగా ఉంది కదూ! టి ఏమిటి కాఫీలాగా! పొరపాటున మరతని ముందా మాట అంటే పులుసులోకి ఎముకలు మిగల కుండా శుద్ధి చేసేస్తాడు.

ఇతని అసలు పేరు లారెన్స్ ట్యురాడ్. చికాగోలోని ఒక బీదకుటుంబంలో పుట్టాడు. చిన్నప్పటి నుంచి దారిద్ర్యంలో పెరిగిన ఇతనికి ధనికులన్నా, అమెరికన్లన్నా బద్ధవైరం! అలా అని నాస్తికుడనుకోకండి! మతమన్నా, దేముడన్నా ఎనలేని గౌరవం, భయం, భక్తి!

అతని చెవులకి వేలాడు ఏడు రింగుల గురించి ఇదే చెబుతాడతను. ఒక చెవిన ఉండే నాలుగు రింగులు, నాలుగు కాలాలని, నాలుగు దిక్కులని సూచిస్తాయట. రెండో చెవిన ఉండే మూడు రింగులు క్రీస్తు సమాధిలో ఉన్న మూడు రోజులని గుర్తుకు తెస్తాయట.

దేముడు నా ద్వారా, సినిమాల ద్వారా టి.వి.ల ద్వారా ప్రజలని చేరుతాడంటాడు, మిస్టర్ టి. అతని తల్లి కూడా ఇప్పుడతన్ని మిస్టర్ టి అనే పిలుస్తుంది.



అతని మెడలోని గొలుసులు అతని పూర్వీకులైన ఆఫ్రికన్లకి అద్దం పడతాయంటాడు. అమెరికన్ల చేతిలో స్వేచ్ఛని పోగొట్టుకున్న తన పూర్వీకులపై అతనికి అభిమానం ఎక్కువ!

సగం గుండు తలని నేషనల్ జాగ్రఫిక్ అనే మేగజైన్‌లో చూసి రూపుదిద్దుకున్నాడతను.

కాగా 'టి' సిగరెట్లు, మాదక ద్రవ్యాలు, మత్తు మందులకి చాలా దూరం. డిస్కోల చుట్టూ తిరగటమన్నా, ఆడపిల్లల వెంట బడటమన్నా అతనికసహ్యం. అతని దృష్టిలో ఆడవాళ్ళంటే తల్లి, కూతురే కనిపిస్తారు. ఒంటరిగా బతకటంలో ఆనందం అంతా ఇంతా కాదంటాడు. రూపానికి తగ్గ క్రౌర్యం గుండెల్లో లేదని ఆశ్చర్యపోతున్నారా! మరి అదే మిస్టర్ టి ప్రత్యేకత.

—గోపి